క్లుప్తంగా

గోపాలకృష్ణకు ఘన నివాళి



దాత సమకూర్చిన పుస్తకాలతో విద్యార్థులు

తాళ్లరేవు: నీలపల్లి సిద్ధార్థనగర్ గ్రామానికి చెందిన ఐపీఎస్ అధికారి కమిడి గోపాలకృష్ణ 30వ వర్ధంతిని బుధవారం బాబా యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణ చిత్రపటానికి గ్రామ పెద్దలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దాత పొనుగుమట్ల అశోక్ సమకూర్చిన పలు పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మోకా మధుబాబు, దడాల ఇజ్రాయిల్, మాతా భూషణం, గంటా గోపి, మోకా రాహుల్, రేవు ప్రవీణ్, గౌతమ్, శ్రీధర్ పాల్గొన్నారు.

శివ జయంతి ఉత్సవాలను ప్రారంభించిన ఆర్డీవో



ఉత్సవాలను ప్రారంభించిన ఆర్డీవో మాధవి

అమలాపురం టౌన్: స్థానిక శివాలయం రోడ్డులో గల ఓంశాంతి కేంద్రంలో 89వ త్రిమూర్తి శివ జయంతి మహోత్సవాలను ఆర్డీవో కొత్త మాధవి బుధవారం రాత్రి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ద్వాదశ జ్యోతిర్లింగాలను ఆర్డీవో దర్శించుకున్నారు. ఓం శాంతి కేంద్ర కార్యాలయం ఇన్‌చార్జి బ్రహ్మ కుమారి శ్రీదేవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, మాజీ ఎమ్మెల్యే చిల్లా జగదీశ్వరి, పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కల్వకొలను తాతాజీ, బోణం సత్య వరప్రసాద్, మున్సిపల్ మాజీ చైర్మన్ నల్లా విష్ణుమూర్తి, వైఎస్సార్ సీపీ నాయకులు వంటెద్దు వెంకన్నాయుడు, సూదా గణపతి, అడపా బాబులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లూర్థుమాత యాత్రా మహోత్సవం



లూర్థుమాత విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగిస్తున్న భక్తులు

యానాం: రోమన్ కేథలిక్ చర్చి ఆవరణలో కొలువైన లూర్థుమాత యాత్రా మహోత్సవం బుధవారం రాత్రి వైభవంగా జరిగింది. యానాం, తాళ్లరేవు, కాజులూరు, కరప తదితర మండలాలకు చెందిన క్రైస్తవులు, ఇతరులు వేలాదిగా పాల్గొని లూర్థుమాత కొండగుడిని దర్శించుకున్నారు. విశేష ప్రార్థనలు నిర్వహించారు. విశాఖపట్టణం అతిమేత్రాశనం పాలనాధికారి డాక్టర్ పొలిమేర జయరావు, ఫాదర్ మరియదాసు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. అనంతరం లూర్థుమాత విగ్రహాన్ని పురవీధులలో పోలీసు బందోబస్తు మధ్య ఊరేగింపు నిర్వహించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

యానాం: బైపాస్ రహదారిలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు ఏఎస్సై కృపావరం బుధవారం తెలిపారు. హెచ్‌పీ పెట్రోల్ బంకు సమీపంలో సుమారు 80 ఏళ్ల వయస్సు గల వృద్ధుని మృతదేహాన్ని గుర్తించి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో మార్చురీకి తరలించినట్లు తెలిపారు. మృతదేహాన్ని బట్టి అతడు యాచకుడిగా భావిస్తున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

అల్లవరం: బోడసకుర్రు దేవీ సెంటర్లో బుధవారం రాత్రి పేకాట ఆడుతున్న శిబిరంపై అల్లవరం పోలీసులు దాడి చేసి వారి నుంచి రూ. 30 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. పేకాట ఆడుతున్న పది మందిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామని ఎస్సై హరీష్ కుమార్ తెలిపారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి

ముమ్మిడివరం: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓ మహిళ బుధవారం మృతి చెందింది. ముమ్మిడివరం మండలం అనాతవరం కైరంవారి వీధికి చెందిన పేరూరి మహాలక్ష్మి(32) తన తోటికోడలితో కలిసి గత ఆదివారం కొమరగిరి శుభకార్యానికి వెళ్లి తిరిగి వస్తుంది. ఈ క్రమంలో అనాతవరంలో రోడ్డు దాటుతుండగా అటుగా వెళుతున్న ఇద్దరు మెడికల్ విద్యార్థినిలు స్కూటీతో ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో మహాలక్ష్మి తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. గాయ పడిన ఆమెను అమలాపురం కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. ముమ్మిడివరం ఎస్సై జ్వాలా సాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో అభిషేక పూజల్లో భక్తులు



మురమళ్ల వీరేశ్వరస్వామికి అభిషేకం నిర్వహిస్తున్న పండితులు



ముమ్మిడివరం ఉమా సూరేశ్వరస్వామిని అభిషేకిస్తున్న అర్చకుడు



రోళ్లపాలెంలో అమలేశ్వరస్వామి ఆలయంలో భక్తులు

దారులన్నీ శివయ్య సన్నిధికే..

- శివ నామస్మరణతో మార్మోగిన ఆలయాలు
- వేలాదిగా తరలి వచ్చిన భక్తులు
- ఘనంగా మహా శివరాత్రి పర్వదినం

ఐ.పోలవరం : పరమ శివునికి అత్యంత ప్రీతికరమైన మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని భక్తులు శివాలయాలకు పోటెత్తారు. ఆలయాలు శివ నామస్మరణతో మార్మోగాయి. సూర్యోదయానికి ముందు వృద్ధ గౌతమీ గోదావరిలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన జల్లు స్నానాలాచరించుకున్న భక్తులు అనంతరం ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ప్రసిద్ధ క్షేత్రమైన మురమళ్ల భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి వారిని సుమారు 30 వేల మంది భక్తులు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి స్వామివారి దర్శనానికి సుమారు కిలోమీటరు మేర భక్తులు బారులు తీరారు. హిందూ ధర్మ పరిషత్, సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధులు సేవా కార్యక్రమాలు చేపట్టారు. స్థానిక హైస్కూల్ సెంటర్ నందు భక్తులకు ఉచిత అన్నదానం ఏర్పాటు చేశారు. తొలుత పుష్కర నదీ జాలాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామోత్సవం చేపట్టారు. సాయంత్రం శూలాల సంబరం, భాజా భజంత్రీలు, బాణాసంచా కాల్పులతో ధూపసేవ అనంతరం నందాదీప కార్యక్రమం జరిగింది. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, చెల్లి వివేకానందలు స్వామిని దర్శించుకున్నారు. మండలంలోని భైరవపాలెం, కే శనకుర్రు, కేశనకుర్రుపాలెం, టి.కొత్తపల్లి, గుత్తినదీవి, గ్రామాల్లో ఉన్న శివాలయాలు భక్తులతో ఉదయం నుంచి కిటకిటలాడాయి.

కుండలేశ్వరానికి పోటెత్తిన భక్తులు

కాట్రేనికోన: మహా శివరాత్రి మహోత్సవాలను పురస్కరించుకొని పవిత్ర పుణ్యక్షేత్రం కుండలేశ్వరంలో పార్వతీ సమేత కుండలేశ్వరస్వామి, పల్లం, మగసానితిప్ప గ్రామాలలో కాలభైరవ క్షేత్రాలకు భక్తులు పోటెత్తారు. మగసానితిప్పలో కాలభైరవ స్వామి దర్శనం కోసం బలుసుతిప్ప, జి మూలపాలెం నుంచి బోటులో మూడు కిలోమీటర్లు గోదావరి పాయలో ప్రయాణించిన భక్తులు కాలభైరవ స్వామిని దర్శించుకున్నారు. కుండలేశ్వరం పుష్కర ఘాట్‌లో భక్తులు వేకువ జామునే స్నానాలాచరించి కుండలేశ్వరస్వామిని దర్శించుకున్నారు. స్వామి దర్శనం కోసం అధిక సంఖ్యలో భక్తులు రావడంతో పుష్కరఘాట్ వరకు క్యూలైన్‌లో దర్శనం కోసం వేచి ఉన్నారు.

సముద్ర తీరంలో పుణ్య స్నానాలు

అల్లవరం: మహా శివరాత్రి పర్వదినం పురస్కరించుకుని మండలంలోని ప్రముఖ శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. కొమరగిరిపట్నం శివారు ఎస్.రామేశ్వరంలో శ్రీరామునిచే ప్రతిష్ఠించిన పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులు భక్తి శ్రద్ధలతో పుణ్యస్నానాలు ఆచరించి తీరంలో కొలువై యున్న స్వామివారిని దర్శించుకున్నారు. దేవగుప్తంలో ఉమా సమేత మల్లేశ్వరస్వామి వారి ఆలయంలో శివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. లక్ష్మణేశ్వరంలో పార్వతీ సమేత లక్ష్మణేశ్వరస్వామి వారి ఆలయంలో భక్తులు బారులు తీరి స్వామివారిని దర్శించుకున్నారు. బోడసకుర్రులో గౌతమేశ్వరస్వామిని భక్తులు దర్శించుకున్నారు. గోడిలోని ఆనంద బాలయోగీశ్వర్ల ఆలయంలో శివరాత్రి ఉత్సవాలు నిర్వహించారు. ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ ఆనంద బాలయోగీశ్వర్లను బుధవారం దర్శించుకున్నారు. జిల్లా నలుమూలల నుంచి స్వామి దర్శనానికి విచ్చేసిన భక్తులకు చింతా కృష్ణమూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మాజీ ఎంపీ చింతా అనురాధ సౌజన్యంలో చల్లని మజ్జిగను అందించారు.

ముమ్మిడివరం: పరమశివునికి అత్యంత ప్రీతికరమైన మహాశివరాత్రి పర్వదినాన్ని బుధవారం ప్రజలు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువజామునుంచే పవిత్ర గౌతమీ, వృద్ధ గౌతమీ గోదావరిలో భక్తులు పుణ్యస్నానాలాచరించి స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. ముమ్మిడివరం ఉమాసూరేశ్వరస్వామి, కొమానపల్లి పార్వతీ సమేత చోడేశ్వర, లోకేశ్వరస్వామి, అయినాపురం ఉమా సోమేశ్వరస్వామి, అన్నంపల్లి పార్వతీ గౌతమేశ్వరస్వామి, కొత్తలంక ఉమా భోగేశ్వరస్వామి, క్రాపచింతలపూడి ఉమా వల్లభేశ్వర స్వామి, ఠాణేల్లంక ఉమా సోమేశ్వర స్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తాళ్లరేవు: మండలంలోని శివాలయాల్లో బుధవారం మహా శివరాత్రి పర్వదిన వేడుకలను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. మండల పరిధిలోని పిల్లంక, బ్రహ్మపురి సరిహద్దులో ఉన్న కాశీ అన్నపూర్ణేశ్వరీ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో గ్రామ పురోహితులు వేలూరి కాశీబాబు నేతృత్వంలో అభిషేకాలను ఏకాదశ ద్రవ్యాలతో చేశారు. స్వామివారికి అన్నాభిషేకం ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త సాగి వీరభద్రరాజు, తోలేటి శ్రీనివాస్, చింతలపాటి శ్రీనివాసరాజు, కనుమూరి వెంకటేశ్వరరాజు, సత్యన్నారాయణరాజు, రామభద్రరాజు, బొజ్జిరాజు తదితరులు పాల్గొన్నారు. సుంకరపాలెం భద్రకాళీ సమేత వీరేశ్వరాలయంలో అఖండ దీపారాధన కన్నులపండువగా జరిగింది. చొల్లంగిలో చంద్ర ప్రతిష్ఠిత లింగమైన రాజరాజేశ్వరీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో రాత్రి 8 గంటలకు భక్తులతో విఘ్నేశ్వర పూజ, మహన్యాస పారాయణం, ఏకాదశ రుద్రాభిషేకాలు, పార్వతీ పరమేశ్వరుల శాంతి కల్యాణం, జ్యోతిర్లింగార్చన నిర్వహించారు.

అమలాపురం టౌన్: శివరాత్రి పర్వదినం సందర్భంగా బుధవారం తెల్లవారు జామునుంచే అమలాపురం పట్టణంలోని శివాలయాలు భక్తులతో పోటెత్తాయి. శివునికి పాలు, పెరుగు, పండ్ల రసాలతో అభిషేకాలు ఉదయం ఉంచి రాత్రి వరకూ సాగుతూనే ఉన్నాయి. స్థానిక పురతాన శివక్షేత్రం చెన్నమల్లేశ్వరస్వామి దేవస్థానంలో దర్శనానికి భక్తులు క్యూ కట్టారు. స్థానిక మెయిన్ రోడ్డులోగల సిద్ధేశ్వరస్వామి ఆలయం వద్ద శివుని దర్శనం కోసం తెల్లవారు జాము నుంచే మెయిన్ రోడ్డు వెంబడి భక్తులు బారులు తీరారు. ఆ ఆలయం వద్ద మెయిన్‌రోడ్డులో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అఖండ దీపారాధనలో వేలాది మంది మహిళలు పాల్గొని దీపాలు వెలిగించారు. ఆలయం వద్ద రాత్రి భారీ ఎత్తున కాల్చిన బాణా సంచాతో ఆకాశం వర్ణ రంజితమైంది. స్థానిక శివాలయంలో రోడ్డులోగల రామలింగేశ్వరస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక అభిషేకాలు చేశారు. సుబ్బారాయుడి చెరువువద్ద గల చంద్రమౌళీశ్వరస్వామి, ఎన్టీఆర్ మార్గ్‌లో గల నాగ లింగేశ్వరసాయి ఆలయంలో భక్తులు శివుని దర్శనం కోసం బారులు తీరారు. స్థానిక రవణం వీధిలో గల బ్రహ్మ కుమారీస్ హార్మోనీ హౌస్‌లో ఓంశాంతి కేంద్రం ఆధ్వర్యంలో 89వ త్రిమూర్తి శివ జయంతి మహోత్సవాలు వైభవంగా జరిగాయి. అక్కడ ఏర్పాటు చేసిన ద్వాదశ జ్యోతిర్లింగాల దర్శనం భక్తులను ఆకట్టుకుంది.

యానాం: మహా శివరాత్రి వేడుకలు బుధవారం యానాంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్థానిక శివాలయంలో తెల్లవారు జాము నుంచే యానాం పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు స్వామివారి దర్శనానికి తరలివచ్చారు. స్థానిక పడవలరేవు వీధి నుంచి శివాలయం వరకు భక్తులు బారులు తీరండంతో పోలీసు యంత్రాంగం క్రమ పద్ధతిలో భక్తులను దర్శనానికి పంపించారు. భైరవపాలెంలో కొలువైన కాలభైరవ స్వామిని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ దర్శించుకుని పూజలు నిర్వహించారు. స్వామివారిని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు సైతం దర్శించుకున్నారు.

అమలాపురం రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో శివరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. రంగాపురం గ్రామంలో రాజేశ్వరీ సమేత రామేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మ ముహూర్త కాలంలో అభిషేకాలు, జ్యోతిర్లింగార్చన జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి దర్శనం చేసుకున్నారు. పాత బండారులంకలో భువనేశ్వరీ సమేత త్రయంబకేశ్వరస్వామి ఆలయానికి భక్తులు తరలివచ్చారు. రోళ్లపాలెంలో అమలేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి దర్శనం కోసం భక్తులు పోటెత్తారు.

ఉప్పలగుప్తం: మండలంలోని గొల్లపల్లి, ఎస్.కొత్తపల్లి, ఉప్పలగుప్తం, మునిపల్లి, చల్లపల్లి, భీమనపల్లి, విలసవల్లి, గోపవరం గ్రామాల్లో శివరాత్రి పర్వదినం పురస్కరించుకుని ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. బుధవారం ఉదయం నుంచి మహాదేవునికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి దర్శినానికి అధిక సంఖ్యలో భక్తులు బారుల తీశారు. విలసవిల్లి రామ మందిరంలో నిర్వహిస్తున్న మహా సౌరయాగంలో మహా జ్యోతిర్లింగార్చాన ఘనంగా నిర్వహించారు.



ఎస్.రామేశ్వరంలో సముద్ర స్నానాలు చేస్తున్న భక్తులు



ఆనంద బాలయోగిని దర్శించుకున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్



కాలభైరవస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే అశోక్



పిల్లంక కాశీ విశ్వేశ్వరస్వామికి అభిషేకాలు చేస్తున్న అర్చకులు



ఎస్.కొత్తపల్లిలో ప్రత్యేక అలంకరణలో ఉమా సమేత బ్రహ్మేశ్వరస్వామి



కుండలేశ్వరం పుష్కరఘాట్ వద్ద గోదావరి పాయలో స్నానాలాచరిస్తున్న భక్తులు



అమలాపురం మెయిన్‌రోడ్డులో సిద్ధేశ్వరస్వామి దర్శనానికి బారులు తీరిన భక్తులు

'చావా' చిత్రం చరిత్రకు నిదర్శనం

అమలాపురం టౌన్: 'చావా' చిత్రం నిజమైన చరిత్రకు నిదర్శనంగా నిలుస్తుందని భజరంగ్ దళ్ రాష్ట్ర సహాయ ప్రముఖ్ శిరంగు నాయుడు అన్నారు. అమలాపురంలో ఆ చిత్రం ప్రదర్శితమవుతున్న శేఖర్ థియేటర్ వద్ద విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ), భజరంగ్ దళ్ ప్రతినిధులు బుధవారం చిత్రాన్ని వీక్షించారు. అనంతరం థియేటర్ బయట 'చావా' చరిత్ర గురించి మాట్లాడారు. అలనాడు ప్రభుత్వ పెద్దలు వాస్తవాలను దాచిపెట్టి భారతీయులను పిరికివారిగా, విదేశీ మొగల్ రాజులు గొప్ప వ్యక్తులుగా చూపించారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఛత్రపతి శివాజీ మహరాజ్, సంబాజి మహరాజ్‌లను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని వీహెచ్‌పీ, భజరంగ్ దళ్ ప్రతినిధులు సూచించారు. థియేటర్ వద్ద జై సంబాజీ మహారాజ్, జై శివాజీ మహారాజ్, భరతమాతకు జై అంటూ నినాదాలు చేశారు.



థియేటర్ వద్ద నినాదాలు చేస్తున్న వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ ప్రతినిధులు

అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

యానాం: నియోజకవర్గ పరిధిలో వివిధ గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను బుధవారం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పరిశీలించారు. దరియాలతిప్ప గ్రామంలో డ్రైనేజీతో పాటు రైతులకు సాగునీరు అందించే కీలకమైన కల్వర్టు పనులను ఆయన పరిశీలించారు. పర్యాటక కేంద్రానికి వెళ్లే రహదారి పనులను సైతం పరిశీలించి వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని, నాణ్యతను పాటించాలని అధికారులకు సూచించారు. బాలయోగి కాలనీ పరిధిలో డ్రైన్ పూడికతో నిండిపోయిందని ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికుల ఫిర్యాదు మేరకు ఎమ్మెల్యే శ్రీనివాస్‌అశోక్ ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. డ్రైన్‌పై ఉన్న కల్వర్టు పూర్తిగా శిథిలమవ్వడంతో మురుగునీటి ప్రవాహం నిలిచి పోయిందని స్థానికులు తెలిపారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే తక్షణమే మరమ్మతు పనులు ప్రారంభించాలని పీడబ్ల్యూడీ అధికారులను ఆదేశించారు. జాతీయ మలేరియా నిర్మూలనా కార్యక్రమం అమలుపై స్థానిక ఆర్‌ఏఓ చాంబర్‌లో ఎమ్మెల్యే అశోక్ సమావేశాన్ని నిర్వహించారు. మలేరియా రహిత యానాంగా తీర్చిదిద్దాలని ఆవిధంగా వైద్యారోగ్య శాఖ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌ఏఓ మునిస్వామి, డీడీ రవిశంకర్ పాల్గొన్నారు.

అయ్యప్పకు వెండి ఆభరణాల సమర్పణ

ముమ్మిడివరం: ముమ్మిడివరం ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయంలో స్వామి వారికి ఓ భక్తుడు సుమారు రూ.1.5 లక్షల విలువ చేసే వెండి ఆభరణాలను బహూకరించారు. ఆలయ వ్యవస్థాపకులు పెన్మత్స జగ్గప్పరాజు గురుస్వామి సమీప బంధువులైన గొంది గ్రామానికి చెందిన అల్లూరి రామచంద్ర రాజు, సూర్యనారాయణరాజు దంపతులు స్వామి వారికి వెండికిరీటం, కంఠాభరణం సమకూర్చారు. వీటిని బుధవారం స్వామివారికి సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పెన్మత్స జగ్గప్పరాజు గురుస్వామి, రామకృష్ణంరాజు, కాజులూరి రామలింగేశ్వరరావు, మహీధర వర్మ, చిన్నారావు, ఆకుల శ్రీనివాసరావు, అయ్యప్ప సేవాసంఘం సభ్యులు పాల్గొన్నారు.



అయ్యప్పస్వామికి వెండి ఆభరణాలు అందజేస్తున్న దాతలు

పోలింగ్‌ను పారదర్శకంగా నిర్వహించాలి

ఎన్నికల సిబ్బందికి ఆర్డీవో మాధవి సూచన

అమలాపురం టౌన్: పట్టభద్రుల శాసన మండలి (ఎమ్మెల్సీ) ఎన్నికల పోలింగ్ ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా నిర్వహించాలని అమలాపురం ఆర్డీవో కొత్త మాధవి ఎన్నికల సిబ్బందికి సూచించారు. స్థానిక వెచ్చావారి అగ్రహారంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రాంగణంలో బుధవారం ఏర్పాటు చేసిన పోలింగ్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో సిబ్బందికి సామాగ్రిని పంపిణీ చేసి ప్రసంగించారు. గురువారం నిర్వహించనున్న ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎన్నికల పోలింగ్ సిబ్బందికి ఎన్నికల నిర్వహణపై ఆర్డీవో పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. సామాగ్రిని చెక్ లిస్ట్ ప్రకారం సిబ్బందికి పంపిణీ చేసే ప్రక్రియను ఆర్డీవో స్వయంగా పర్యవేక్షించారు. అమలాపురం డివిజన్ పరిధిలో 45 పోలింగ్ కేంద్రాల నిర్వహణకు 270 మంది పోలింగ్ సిబ్బందిని నియమించినట్లు వివరించారు. పోలింగ్ నిర్వహణను 5 జోన్లుగా విభజించి 5 సెక్టార్లను 5 రూట్లుగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గురువారం ఉదయం 8 గంటలకు పోలింగ్ ప్రారంభించేందుకు వీలుగా తెల్లవారు జామునే సిట్టింగ్ ఏర్పాట్లు, పోటీలోని అభ్యర్థుల జాబితాల ప్రదర్శన, రహస్య ఓటింగ్‌కు భంగం వాటిల్లకుండా ఓటింగ్ కంపార్ట్‌మెంట్ వంటి ఏర్పాట్లను ముందుగానే ఏర్పాటు చేసుకోవాలని పోలింగ్ సిబ్బందికి ఆర్డీవో సూచించారు.



పోలింగ్ కేంద్రాల సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఆర్డీవో మాధవి

డ్రగ్ ట్రేడ్ అసోసియేషన్ ప్రతినిధులకు సత్కారం

అమలాపురం టౌన్: అమలాపురం ది చాంబర్ ఆఫ్ కామర్స్‌కు చెందిన ముగ్గురు మెడికల్ హోల్ సేల్ వ్యాపారస్తులకు జిల్లా డ్రగ్ ట్రేడ్ అసోసియేషన్‌లో పదవులు దక్కడంతో వారికి చాంబర్ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం సత్కారం జరిగింది. స్థానిక శుభ గృహలో జరిగిన ఈ సత్కార సభకు చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోణం సత్య వరప్రసాద్ అధ్యక్షత వహించారు. చాంబర్ కార్యదర్శిగా ఉన్న కొమ్మూరి వెంకటాచల ప్రసాద్ జిల్లా డ్రగ్ ట్రేడ్ అసోసియేషన్‌కు గౌరవాధ్యక్షునిగా, చాంబర్ డైరెక్టర్‌గా ఉన్న గునిశెట్టి వలీబాబా జిల్లా డ్రగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షునిగా, చాంబర్ ఉపాధ్యక్షుడు మెకా వెంకట సుబ్బారావు జిల్లా డ్రగ్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీగా ఎన్నిక కావడంతో చాంబర్ సమావేశం హర్షం వ్యక్తం చేసింది. అటు చాంబర్‌లో వ్యాపారుల సమస్యల పరిష్కారానికే కాక జిల్లా డ్రగ్ అసోసియేషన్‌లో తమకు లభించిన పదవుల ద్వారా డ్రగ్గిస్టుల ఇబ్బందులపై స్పందిస్తామని వెంకటాచల ప్రసాద్, వలీ బాబా, వెంకట సుబ్బారావులు స్పష్టం చేశారు.

ఎమ్మెల్సీ పోలింగ్‌కు సర్వం సిద్ధం

తాళ్లరేవు: ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. ఈ మేరకు మండలంలోని మూడు పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది బుధవారం సాయంత్రానికే చేరుకున్నారు. గురువారం ఉదయం ఏడు గంటలకు పోలింగ్ ప్రారంభం కానుందని తహసీల్దార్ పితాని త్రినాథరావు తెలిపారు. ఓటరు గుర్తింపుకార్డు, ఆధార్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డ్ తదితర ప్రభుత్వ గుర్తింపు కార్డులను చూపి పోలింగ్‌లో పాల్గొనవచ్చని తెలిపారు. పోలింగ్ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కోరంగి ఎస్సై సత్యనారాయణ నేతృత్వంలో సిబ్బంది బందోబస్తు నిర్వహించనున్నారు.

ముమ్మిడివరం: ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ముమ్మిడివరం మండలంలో మూడు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ముమ్మిడివరం తహసీల్దార్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి సుబ్బలక్ష్మి తెలిపారు. ముమ్మిడివరం జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో మూడు, జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో రెండు పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గురువారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలిగ్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. మండలంలో 3,107 మంది పట్టభద్రులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

ఇమ్మిడివరప్పాడులో శూలాల సంబరం

అమలాపురం రూరల్: మండలంలోని ఇమ్మిడివరప్పాడులో కరికాల భక్తుల ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన వీరభద్రస్వామి ఆలయంలో శూలాల సంబరం బుధవారం వైభవంగా జరిగింది. యువకులు ఉపవాసంతో బుగ్గలకు, కంఠానికి శూలాలు గుచ్చుకుని మొక్కులు తీర్చుకున్నారు. శూలాధారులను ట్రాక్టరుపై ఉంచి మేళతాళాలతో గ్రామోత్సవం నిర్వహించారు.